క్లుప్తంగా

చండూరు ఎస్ఐగా సురేష్‌కుమార్


సురేష్‌కుమార్

చండూరు : మండల నూతన ఎస్ఐగా ఉప్పు సురేష్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నూతన మండలం గట్టుప్పల్‌లో కొంతకాలంగా ఆయన పనిచేస్తూ చండూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నవీన్‌కుమార్ సీఐగా పదోన్నతి పొందారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ సరిత

మర్రిగూడ : గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని మేటి చందాపురం గ్రామంలో జెడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన అండర్ డ్రెయినేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రెయినేజీ పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో రాములు, భిక్షం, అబ్బయ్య, నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి

చిట్యాల : గ్రామాల్లో పేదరికంలో మగ్గిపోతున్న విశ్వబ్రాహ్మణులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విశ్వబ్రాహ్మణ కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో కుల సంఘం నాయకులు చొల్లేటి ఓంప్రకాష్‌చారి, సంకోజు నర్సింహాచారి, అందోజు మహేంద్రాచారి, గుంటోజు నర్సింహ, వెలుర్తి భూషణాచారి, గట్టోజు అంజయ్యచారి పాల్గొన్నారు.

కొండయ్య సేవలు మరువలేనివి

చండూరు : మండలానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పులకరం కొండయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర గీత కార్మిక ఫెడరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మల్లేపల్లి ఆదిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కొండయ్య దశదిన కర్మకు హాజరై నివాళులర్పించారు. వారిలో రచయిత నాగిళ్ల శంకర్, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, కాంగ్రెస్ నాయకులు కోడి గిరిబాబు, ధనుంజయ్, వనం లింగయ్య, తదితరులు ఉన్నారు.

యాదయ్య మృతికి సంతాపం


యాదయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పుతున్న రవీందర్

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వరికుప్పల యాదయ్య గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహాన్ని ఆదివారం టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొంపెల్లి వెంకట్‌రెడ్డి, చీమల వీరేశం, సామిడి మోహన్‌రెడ్డి, కందాటి రమేష్‌రెడ్డి, ఖాజా పాషా, సత్తయ్య, కాటమయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నాంపల్లి : బస్సు– ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరోకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నాంపల్లికి వస్తుండగా నాంపల్లి నుంచి నల్లగొండకు వెళ్తున్న బస్సును ఢీకొన్నారు. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒకరికి తీవ్రగాయాలై కాలు విరిగింది, కాగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయంపై ఎస్ఐ నాగరాజును వివరాలు కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్ : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. కనగల్ వాగు నుంచి అదే గ్రామానికి చెందిన దేశిడి వినోద్ అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

వాగు పారితే రాకపోకలు బంద్

- ఉప ఎన్నిక సందర్భంగా వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చిన మంత్రులు
- నేటికీ అమలు కాని వైనం
- ఇబ్బందులు పడుతున్న సోలిపురం గ్రామస్తులు


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు (ఫైల్)


వాగులో మోకాలు లోతు నీటిలో నుంచి వెళ్తున్న గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని సోలిపురం గ్రామానికి వెళ్లడానికి సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సోలిపురం గ్రామం గాంధీసాగర్ చెరువుకు ఆనుకొని ఉండడంతో చెరువులోకి నీరు వచ్చే వాగులో నుంచే ఆ గ్రామానికి వెళ్లాలి. వర్షాలు కురిసిస్తే చాలు వాగు పారుతుంది. ఆ సమయంలో ఆ దారి వెంట ప్రజలు రాకపోకలు జరపడం ఇబ్బందిగా ఉంటుంది. మట్టి రోడ్డు కావడంతో బురదమయంగా మారి కనీసం నడవలేని పరిస్థితి. దీంతో ప్రజలు ఆ గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న మునుగోడు మండల కేంద్రానికి చండూరు మండలంలోని బోడంగిపర్తి గ్రామం మీదుగా నడవాల్సి వస్తోంది.

హామీ ఇచ్చిన మంత్రులు..

గత ఏడాది నవంబర్ మాసంలో జరిగిన మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా ప్రచారం చేసేందుకు వెళ్లిన మంత్రి జగదీశ్‌రెడ్డి సోలిపురం గ్రామ సమస్యలను రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు. స్పందించిన మంత్రి ఎన్నికల అనంతరం గ్రామానికి పక్కా రహదారి ఏర్పాటు చేయడంతోపాటు వాగుపై వంతెన నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎన్నికలు ముగిసి దాదాపు 10 నెలలు కావొస్తున్నా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిరసన తెలిపిన బీఎస్పీ నాయకులు, గ్రామస్తులు

సోలిపురం గ్రామంలోని 110 ఇళ్లలో దాదాపు 520 మందికి పైగా నివాసం ఉంటున్నారు. గ్రామానికి సరైన రోడ్డు, వంతెన లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవల బీఎస్పీ ఆధ్వర్యంలో ఆ గ్రామ ప్రజలు వాగులో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని సోలిపురం గ్రామానికి పక్కా రోడ్డుతోపాటు వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంతెన, పక్కా రోడ్డు నిర్మించాలి



మా గ్రామం నుంచి మునుగోడుకు వెళ్లే దారిలో వాగు ఉండడంతో వర్షాకాలంలో రాకపోకలు జరపలేకపోతున్నాం. వాగుపై వంతెన నిర్మించి బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలి. ఉప ఎన్నిక సమయంలో వంతెన నిర్మిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. కానీ నేటికీ నిధులు మంజూరు చేయలేదు.

– గుండెపాక నర్సింహ, సోలిపురం

వంతెన నిర్మించే వరకు ఆందోళనలు చేస్తాం



సోలిపురం గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఉప ఎన్నిక సమయంలో వంతెన, రోడ్డు నిర్మిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు హామీ ఇచ్చి మాట తప్పారు. వాగుపై వంతెన నిర్మించేవరకు బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం.

– పందుల సురేష్, బీఎస్పీ నాయకుడు

రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపించొద్దు

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లింగయ్య

నార్కట్‌పల్లి : పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపించొద్దని, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బస్టాండ్ వద్ద రోడ్డు విస్తరణలో దుకాణాలు కొల్పోతున్న వారితో మాట్లాడారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణలో పలు దుకాణాలు కొల్పోకతప్పదని, దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అధికారులు మార్కింగ్ చేసినంత వరకు తొలగించనున్నట్లు తెలిపారు. రోడ్డు కాంట్రాక్టర్ తప్పని సరిగా నిబంధనలు పాటించి పనులను చేపట్టాలని, రోడ్డు విస్తరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీలు పుల్లంల ముత్తయ్య, మేకల రాజిరెడ్డి, దుబ్బాక పావనిశ్రీధర్, నాయకులు బొబ్బిలి మల్లేశం, నడింపల్లి నరేష్, మహేష్ తదితరులున్నారు.

నిరుపేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి మహిళా విభాగం సభ్యులు

నల్లగొండ టౌన్ : నిడమనూరు మండలం ముప్పారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేదరికంలో ఉండి చదువుకుంటున్న ముగ్గురు విద్యార్థినులకు పట్టణానికి చెందిన సత్యసాయి సేవాసమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అదేవిధంగా వారు సామాజిక సేవ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సేవాసమితి మహిళా విభాగం సభ్యులు సువర్ణ, జయశ్రీ, గీత, జ్యోతి, జానకి, శారధ, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు బ్రహ్మం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళను ప్రోత్సహించాలి


చేనేత ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

రామగిరి(నల్లగొండ) : చేనేత హస్తకళను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శివాజీనగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళాభారతి చేనేత హస్తకళ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కళాభారతి అధ్యక్షుడు జెల్లా సత్యనారాయణ, సహాయ కార్యదర్శి శనిగర కిశోర్ మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శన అమ్మకాలు ఈనెల 19వరకు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వార్డు కౌన్సిలర్ యామ కవితదయాకర్, ఖయ్యూంబేగ్, సమీ, బోయినపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తీవ్ర అన్యాయం


మాట్లాడుతున్న మాల సంఘం నాయకులు

మునుగోడు : దళితులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలులో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆ సంఘం నాయకులు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో మాల మహానాడు సంఘం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న దళిత బంధుతో పాటు ఇతర పథకాలలో మాల కులస్తులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాలలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు సంక్షేమ పథకాలల్లో కులాల వారీగా యూనిట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు ముచ్చపోతుల శ్రీనివాస్, జంగిలి నాగరాజు, బేరి లింగస్వామి, బాజ మనోజ్, పెమాండ్ల ప్రమోద్, యాదగిరి, పవన్, సైదులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


నార్కట్‌పల్లి : మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దులు


చిట్యాల : సమావేశంలో మాట్లాడుతున్న కత్తుల లింగస్వామి

నార్కట్‌పల్లి : అర్హులైన వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెంలో ఇళ్లు లేని పేదలను కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి ఇచ్చే రూ.3లక్షలు ఏ విధంగా సరిపోతాయే ప్రభుత్వం తెలపాలన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలో ఇప్పటి వరకు పేద ప్రజలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు దండు రవి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దండు నాగరాజు, ఐద్వా సంఘం నాయకుడు కుమ్మరి పద్మ, దండు పద్మ, పుష్ప, లక్ష్మమ్మ, నరసమ్మ, ఈదమ్మ, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

చిట్యాల : ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించనున్న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన కోరారు. గ్రామాల్లో గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెంటనే పంపిణీ చేసి పట్టాలు అందజేయాలన్నారు. సమావేశంలో రెడపాక మల్లయ్య, సంఘం మండల కార్యదర్శి మెట్టు పరమేష్, ఉపాధ్యక్షుడు రెడపాక మల్లయ్య, నాయకులు రుద్రవరం మహేశ్వర్, కడగంచి నర్సింహ, నాతి వెంకట్రామయ్య, అర్రూరీ శంభయ్య, లోడే విష్ణు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

తాటి, ఈత వనాలను సంరక్షించుకోవాలి


పల్లె రవికుమార్‌ను సన్మానిస్తున్న గౌడ కులస్తులు

మర్రిగూడ : గౌడన్నల కులవృత్తిలో భాగమైన తాటి, ఈత వనాలను బాధ్యతాయుతంగా సంరక్షించుకోవాలని తెలంగాణ కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని లెంకలపల్లి గ్రామంలో గౌడ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరెకరాల ఈత వనంను పరిశీలించారు. రోడ్డు సౌకర్యంతో పాటు, బోరు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే బోరు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధిహామీ పథకం కార్యక్రమం ద్వారా ఈత వనంలో పెరిగిన ఇతర కలుపు మొక్కలను తొలగించేందుకు అధికారులతో మాట్లాడిస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగంగౌడ్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు ఐతగోని పాపయ్య, అంజయ్య, కలిమెల్ల రాములుగౌడ్, ఐతగోని వెంకన్నగౌడ్, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ వైద్యులకు సన్మానం


డాక్టర్ చెరుకు సుధాకర్, వీరబ్రహ్మంను సన్మానిస్తున్న వైద్యులు

నకిరేకల్ : పట్టణంలో ఐఎంఏ, హైదరాబాద్ ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా ఆదివారం సీనియర్ డాక్టర్ చెరుకు సుధాకర్, వీరబ్రహ్మంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాపోలు రఘునందన్ మాట్లాడారు. 17మంది డాక్టర్లతో ప్రారంభమైన ఐఎంఏ నేడు 27మందికి చేరిందన్నారు. కార్యక్రమంలో ఓజోన్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్లు రంజిత్‌రెడ్డి, సతీష్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, పూర్ణచందర్, శ్రీనాథ్‌నాయుడు, సోమసంతోష్, రమేష్, రవి, మంజుల, వెంకటరమణ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుఅన్నారం పాల సొసైటీ పాలకవర్గం ఎన్నిక


చైర్మన్‌గా ఎన్నికైన సూరారపు జయమ్మ

కట్టంగూర్ : మండలంలోని చెర్వు అన్నారం గ్రామంలో ఆదివారం నల్లగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ చైర్మన్‌గా సూరారపు జయమ్మ, డైరెక్టర్లుగా దెందె యాదయ్య, సభ్యులుగా నంద్యాల అనంతరెడ్డి, ఊట్కూరి యాదయ్య, నంద్యాల అంతిరెడ్డి, అద్దంకి లింగయ్య, యాదమ్మ, మల్లయ్య, దెందె లక్ష్మమ్మ, వీరయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జయమ్మ మాట్లాడుతూ.. సొసైటీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ సూపర్‌వైజర్ కాసర్ల సాగర్‌రెడ్డి, వేతన కార్యదర్శి అంజయ్య, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కనగల్ : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిన మండలంలోని బిచ్చల శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాకతీయ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జ్ అరెగంటి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో లైన్‌మెన్‌లు రూ.లక్షల్లో ప్రభుత్వం ఇచ్చే జీతాలు తీసుకుంటూ విధులు నిర్వహించకుండా ప్రైవేట్ వర్కర్లను పెట్టుకుని, చాలీచాలని జీతాలు ఇచ్చి వెట్టి చాకిరీ చేయించుకుంటూ వారి జీవితాలతో చెలగాటమాడుకుంటున్నారని అన్నారు. అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకుని మరోసారి ఇలాంటి దుర్ఘటనలు జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే శ్రీను కుటుంబానికి రూ.50లక్షల నగదు అందజేసి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సబ్‌స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన బిచ్చల శ్రీను విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి చెందడాని, అతడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ఆదివారం గ్రామస్తులు, బంధువులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అంతిరెడ్డి, ఏఈ రాజశేఖరాచారి వారి వద్దకు వచ్చి విద్యుత్ శాఖ అధికారుల తరుపున రూ.15లక్షలు, సెల్ టవర్ వారి నుంచి రూ.లక్ష సాయం అందిస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.


పలువురు నాయకుల పరామర్శ..

విద్యుదాఘాతంతో మృతిచెందిన శ్రీను కుటుంబాన్ని ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, సర్పంచ్‌లు నర్సింగ్ సునితాకృష్ణయ్యగౌడ్, కారింగు పార్వతమ్మజానయ్యగౌడ్, పగిళ్ల యాదయ్య మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి పరామర్శించారు.

శ్రీను కుటుంబాన్ని ఆదుకుంటాం

నల్లగొండ టూటౌన్ : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన శ్రీను కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న శ్రీను మృతదేహాన్ని సందర్శించి శ్రీను కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బోయినపల్లి గ్రామ సర్పంచ్ కారింగు యాదయ్య, బుడమర్లపల్లి సర్పంచ్ కారింగు జానయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి


కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డిని కలిసిన ఊట్కూరు గ్రామస్తులు

శాలిగౌరారం : మండలంలోని ఊట్కూరు గ్రామంలో పునర్నిర్మాణం చేపడుతున్న శివాంజనేయ దేవాలయానికి సహకారం అందించాలని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గ్రామానికి చెందిన ఏసీపీ యాస వెంకట్‌రెడ్డిని కోరారు. గ్రామానికి చెందిన పలువురు హైదరాబాద్‌లోని కుషాయిగూడ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న యాస వెంకట్‌రెడ్డిని ఆదివారం ఆయన కార్యాలయంలో కలిశారు. శివాంజనేయ దేవాలయానికి సహకారం అందించాలని కోరడంతో స్పందించిన ఆయన తాను ఎల్లప్పుడు సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. అదే విధంగా గ్రామంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రంథాలయం ఏర్పాటు చేసి యువకులను విద్యావంతులను చేసేందుకు గ్రామస్తులు పాటుపడాలన్నారు. ఏసీపీని కలిసిన వారిలో దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రంగు ముత్యంరాజు, ప్రధాన కార్యదర్శి కొత్తోజు బ్రహ్మచారి, కోశాధికారి గుండ్ల శ్రీనివాస్, ప్రతినిధులు రంగు జానయ్య, అన్నెబోయిన సైదులు తదితరులు ఉన్నారు.

గురుపౌర్ణమికి ఆలయాలు ముస్తాబు


విద్యుత్ దీపాలతో అలంకరించిన సాయినగర్‌లోని సాయిబాబా దేవాలయం


సాయినగర్‌లో బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన కమిటీ సభ్యులు


శివాజీనగర్ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక అలంకరణ

నేడు (సోమవారం) గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శివాజీనగర్, సాయినగర్, వీటి కాలనీ, రాఘవేంద్రకాలనీ, చర్లపల్లిలోని సాయిబాబా ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను కమిటీలు విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. బాబా దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్ల బారికేడ్లు చేశారు. అదే విధంగా అన్నదానం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నల్లగొండ

నకిరేకల్‌లో అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నకిరేకల్ : పట్టణంలోని జెడ్పీ పాఠశాలలో 2000–01 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని స్థానిక పాఠశాలలో జరుపుకున్నారు. 23ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటూ స్థిర పడిపోయారు. ఈ సందర్భంగా వారు కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని అప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

నల్లగొండ రూరల్ : మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని బీఆర్‌ఎస్ నాయకుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని దోమలపల్లి గ్రామంలో కంబంపాటి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కె.కొండారం గ్రామానికి చెందిన ఆవుల హనుమంతు అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు అందజేశారు. దండంపల్లిలో మద్దెల పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా దశదిన కర్మకు హాజరై ఆమె కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గిరి, చైతన్య, యాదయ్య, రామలింగం, అల్లి వెంకన్న, శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న పెద్ది వెంకటేశ్వర్లు

నకిరేకల్ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చందుపట్ల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన పెద్ది వెంకటేశ్వర్లు(52) అనే కల్లు గీతకార్మికుడు రోజువారిగా గ్రామశివారులో తాటి చెట్లను ఎక్కేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో జారి కింద పడిపోయాడు. దీంతో కాళ్లు, చేతులు విరిగాయి. వెంకటేశ్వర్లును మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.